క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: హనుమకొండ నక్కలగుట్టలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7.30గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని హనుకొండ డీఈఈ సాంబరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కలగుట్ట సబ్ స్టేషన్ పరిధిలోని వినాయకనగర్, నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, సర్క్యూట్ గెస్ట్ హౌజ్, అశోక్ కాలనీ, గోకుల్‌నగర్, కోర్టు ప్రాంగణం, రాంనగర్, పోలీస్ హెడ్‌క్వాటర్స్, భవానీనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కోమటిపల్లి, భద్రకాళి నగర్, లోటస్ కాలనీ, కేచర్ కాలనీ, నేచర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు కేయూలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

కేయూ క్యాంపస్: భారత మాజీ ఉపప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రాం 116వ జయంతి వేడుకలను కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. తొలుత కేయూ దూరవిద్య కేంద్రంలోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం 10గంటలకు నివాళులు అర్పించనున్నారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, గౌరవ అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి పాల్గొంటారు. అనంతరం, కేయూ పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశంలో కాంటెంపరరీ ఇష్యూస్ ఆఫ్ ఇండియన్ సొసైటీ అనే అంశంపై హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ ప్రసంగించనున్నారు. కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ టి.రాజమణి పాల్గొంటారు.

నేడు వరంగల్ కలెక్టరేట్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ కలెక్టరేట్‌లో భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న వేడుకలకు అధికారులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, కుల సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఉజ్జయిని ఆలయంలో ఆశ్రితారెడ్డి నృత్య ప్రదర్శన



కాజీపేట: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థి ఆశ్రితారెడ్డి గురువారం నృత్యం చేసి ఆకట్టుకుంది. మహంకాళి దేవాలయ ప్రాంగణంలో ఏడుపాయల నృత్యం చేసి పలువురితో ప్రశంసలు అందుకుంది. ఆశ్రితారెడ్డికి ఉజ్జయిని ఎంపీ అనిల్ ఫిరోజియా శాలువ కప్పి షీల్డ్, నగదు బహుమతి అందజేస్తూ అభినందించారు. డ్యాన్స్ టీచర్ శారదను రాజ్యసభ సభ్యులు యోగి ఉమేష్ నాథ్, ఫిరోగి రామ్‌నాథ్, జి.బాబా సన్మానించారు. ఈమేరకు విద్యార్థికి పాఠశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య అభినందనలు తెలిపారు.

కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు బారికేడ్లు



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ (ఆర్పీఎఫ్)కు సికింద్రాబాద్ నుంచి 20 బారికేడ్లు వచ్చాయి. కాజీపేట జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు, రాజకీయ పార్టీల నాయకులు ఆందోళనలు, రైల్‌రోకోలు చేసే సమయంలో, అగ్నిపథ్ లాంటి ఘటనలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు తెలిపారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువతి అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ శంభునిపేట గవిచర్ల క్రాస్‌రోడ్డులోని రుద్రమానగర్‌కు చెందిన ఎండీ.అహ్మదుల్లా ఖాన్ కుమార్తె సాద్య కౌసైన్ (17) ఇంటర్ సెకండ్ ఇయర్ ఇటీవల పూర్తి చేసింది. ప్రస్తుతం నగరంలోని ప్రైవేట్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌కు ట్రెనింగ్‌కు వెళ్తోంది. గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఆ యువతి తండ్రి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

సమస్యలు @ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్

- తలుపులేని మరుగుదొడ్డి
- విరిగిపోయిన గేట్లు.. కాలిపోయిన మోటారు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రతాప్‌నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్



కమ్యూనిటీ టాయిలెట్ల వద్ద నీళ్ల డ్రమ్ములు



విరిగిపోయిన గేటు



తలుపులేని మరుగుదొడ్డి



కాలిపోయిన మోటారు



ఖాళీ మద్యం బాటిళ్లు

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ ప్రతాప్‌నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. డివిజన్‌లోని ప్రజలు చిన్నచిన్న ఫంక్షన్లు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వరంగల్ మహా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ సరైన నిర్వహణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రెండు నెలలు క్రితం హాల్‌లోని కరెంట్ మోటారు కాలిపోయింది. అలాగే, మరుగుదొడ్డికి తలుపులు లేవు. భవనానికి వెనుక వైపు ఉన్న గేట్లు విరిగిపోయి ఉండటంతో కుక్కలు, పందులు సంచరిస్తూ హాల్ ఆవరణను అపరిశుభ్రం చేస్తున్నాయి. రాత్రి వేళలో కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, మందుబాబులు మద్యం తాగి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా, గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ముస్లింలకు రంజాన్ కానుకల పంపిణీ



కాజీపేట: కానుకలు పంపిణీ చేస్తున్న నాయకులు

కాజీపేట: పేద కుటుంబాలకు రంజాన్ కానుకలను పట్టణంలోని 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో కార్పొరేటర్ విజయశ్రీ గురువారం సాయంత్రం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఎండీ.నేహాల్ ఆధ్వర్యంలో పేదలకు చేయూతనందించారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, పోగుల సంతోష్, రతన్, సుధీర్, శ్రీనివాస్, ప్రదీప్ పాల్గొన్నారు.

తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో..

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వరంగల్ రేడియో ప్రొడ్యూసర్, టీవీ ప్రెజెంటర్ డాక్టర్ సయ్యద్ మగ్దూమ్ మొహినొద్దీన్, ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అడ్మినిస్టేటివ్ మేనేజర్ ఎండీ.షోకత్ సాహబ్, ఫాదర్ కొలంబో వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ నజియా అంజుమ్, క్రిస్టల్ ఓవర్సీస్ ఫౌండర్, సీఈఓ డాక్టర్ ఏ.మహేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ముస్లిం విద్యార్థులకు రంజాన్ గిఫ్టలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటేశ్వర్‌రావు, తాళ్ల తరుణ్, వైష్ణవి, ప్రొఫెసర్లు సత్యనారాయణ పట్నాయక్, కల్పనా స్వెయిన్, ఫసియొద్దీన్, ఎండీ.బేగ్, స్వర్ణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రామన్నపేట: వరంగల్ నగరంలోని మట్టెవాడలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం ఉదయం 6గంటలకు బాలభోగం, 8గంటలకు హన్మత్ వాహన సేవ, 10గంటలకు సుదర్శన నరసింహ హవనం, బలిహరణ, మధ్యాహ్నం 12గంటలకు విశతూర్ణత్సవం (పసుపు కొట్టుట) వంటి కార్యక్రమాలను వేద మంత్రోచ్చరణల మధ్య పండితులు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారికి మొక్కులు చెల్లించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు దేవాలయానికి తరలివచ్చారు. సాయంత్రం 7.30గంటలకు ఆలయ అర్చకులు రాఘవ చార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఇరుకుళ్ల రమేష్, రాజమణి, కొత్త మాధవి, బెజగం వనిత, పబ్బా కల్యాణి, లక్ష్మీకాంత, అరుణ, శ్రీలత, నీల పద్మ, ఉజ్వల రాణి, శిరీష, రాధిక, పుష్ప, పాత కవిత, గోనె పద్మ పాల్గొన్నారు.

మల్కాపూర్ రిజర్వాయర్ నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యంరెడ్డి

నయీంనగర్: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కరువు వస్తే తాగునీటి కొరత తీవ్రంగా ఏర్పడుతుందని, అందుకు పరిష్కారంగా చిలుకూర్ మండలం మల్కాపూర్‌లో 10.75 టీఎంసీల రిజర్వాయర్‌ను నిర్మించాలని కొత్తపల్లి మాజీ సర్పంచ్ కేసర ముత్యంరెడ్డి కోరారు. హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వరంగల్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం ఏపీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి.. ధర్మసాగర్ చెరువును 1.5 టీఎంసీతో రిజర్వాయర్‌గా చేశారని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో మల్కాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం టెండర్ పూర్తిచేసి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. మల్కాపూర్ రిజర్వాయర్ నిర్మాణం జరిగితే వరంగల్, హనుమకొండ, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, పాలకుర్తి నియోజకవర్గాల్లో సాగు, తాగు నీటి సమస్య పూర్తిగా తీరిపోతుందని వివరించారు. సమావేశంలో తోట బాబురావు, సురేందర్‌రావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రాసిక్యూషన్ డైరెక్టర్ వైజయంతి

హన్మకొండ కల్చరల్: భద్రకాళి అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి గురువారం దర్శించుకున్నారు. ముందుగా ఆదిశంకరులు, వల్లభగణపతిని దర్శించుకుని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వైజయంతికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేష వస్త్రాలు అందించి ఆశీర్వచనం అందజేశారు.

మతతత్వ బీజేపీని ఓడించే సత్తా కాంగ్రెస్‌కే ఉంది



మాట్లాడుతున్న అఖిల్

కాజీపేట అర్బన్: మతతత్వ బీజీపీని ఓడించే సత్తా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని తెలంగాణ మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అఖిల్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం పతనమవుతుందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మజహర్ హుస్సేన్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ పార్లమెంట్ సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాశిబుగ్గ: ఈనెల 7వ తేదీన వరంగల్‌లో జరగనున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల పార్లమెంట్ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ పిలుపునిచ్చారు. ప్రతాప్‌నగర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 3 పార్లమెంట్ ఎస్సీ నియోజకవర్గాల్లో అధికంగా ఉన్న మాదిగ సమాజానికి కాంగ్రెస్ పార్టీ ఒక్క టికెట్ కూడా ఇవ్వకుండా మోసం చేసిందని వాపోయారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు ఓటు వేయకుండా బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, కోట రాజు, గంగారపు మల్లన్న, ఇసంపెల్లి రాజు, మహేందర్, క్రాంతి, నరేందర్, యోగి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖపై కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న అంజన్‌రావు

కాజీపేట అర్బన్: రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు బీసీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్‌రావు తెలిపారు. హనుమకొండ హరితహోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంజన్‌రావు మాట్లాడారు. బీసీ కులానికి చెందిన మంత్రి సురేఖ తాటతీస్తా అని వ్యాఖ్యానించిన కేటీఆర్.. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లిక్కర్ స్కాంలో కవిత జైలుకు వెళ్లినట్లే ఫోన్ ట్యాపింగ్‌లో కేటీఆర్‌తో పాటు కొంతమంది బీఆర్ఎస్ నేతలు జైలుకు వెళ్లడం ఖాయమని ఆరోపించారు. కార్యక్రమంలో సిద్దిరాజుయాదవ్, గోదాసి చిన్న తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కులను కాలరాస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఖిలా వరంగల్: మనుధర్మ శాస్త్రం మనిషిని మనిషిగా చూడలేదని, అలాంటి మనుధర్మ శాస్త్ర భావజాలంతో కలిగిన బీజేపీకి ఓటేస్తే మనుధర్మ శాస్త్రానికి మద్దతు ఇచ్చినట్లే అని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సంగీ ఎలేందర్ అధ్యక్షతన దళిత హక్కుల పోరాట సమితి సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో మత సామరస్యం తీవ్రంగా దెబ్బతిన్నదని, దళితులపైన దాడులు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. లౌకిక దేశాన్ని హిందూ రాజ్యాంగ మార్చడానికి కేంద్ర ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతోందని విమర్శించారు. సమావేశంలో జన్ను రవి, రౌంటాల దేవ, రాజేందర్, జన్ను శంకర్, హరిబాబు, పైడి, కోటి పాల్గొన్నారు.

శంభులింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అభిషేకం చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామిని బీజేపీ నేతలతో కలిసి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శంభులింగేశ్వరుడికి పంచామృతాలతో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారి శీలమంతుల శంభులింగం తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వాదం అందజేశారు. అనంతరం, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ జన్మదిన వేడుకల సందర్భంగా అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. నాంద్రే అమర్‌నాథ్, అంకాల జనార్దన్, ముద్దసాని కృష్ణ, వైట్ల గణేష్, కోమాకుల నాగరాజు, పుప్పాల శ్రీనివాస్, బిల్లా కిషోర్, నందు, నాగరాజు గౌడ్, ఇనుముల రాజు, బొల్లా కిరణ్, మేకల రాజు, కాంద్రాతి శ్రీను, డీకే రాజు, సర్వర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆటో నడవక.. అమ్ముకున్నాడు..

ఆర్థిక ఇబ్బందులు తాళలేక బలవన్మరణం

మడికొండ: ఓ ఆటోడ్రైవర్ గిరాకీ లేకపోవడంతో ఇటీవల దానిని అమ్ముకుని కూలీగా మారాడు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మడికొండలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన వస్కుల రాజు(37) 15 ఏళ్లనుంచి మడికొండలో నివాసం ఉంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. ఆటో గిరాకీ లేకపోవడంతో అమ్ముకుని కూలి పనికి వెళ్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై గురువారం తెల్లవారు జామున ఇంట్లోని పైపునకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య వస్కుల రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు.

కోర్టుకు హాజరైన కేయూ రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో 2010లో చేపట్టిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి కోర్టు ధిక్కరణ కేసులో కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం గురువారం హైకోర్టుకు వ్యక్తిగతంగా హాజరైనట్లు సమాచారం. ఈ కేసు వ్యవహారంలో ఇటీవల వ్యక్తిగతంగా ఏప్రిల్ 4న హాజరుకావాలని హైకోర్టు నోటీస్‌లు జారీ చేయడంతో ఇరువురు హాజరైనట్లు తెలిసింది.

ఇంటి వద్దకే రామయ్య కల్యాణ తలంబ్రాలు

కాజీపేట అర్బన్: రూ.151 చెల్లిస్తే తెలంగాణ ఆర్టీసీ సౌజన్యంతో లాజిస్టిక్ సేవా విభాగం ఆధ్వర్యంలో భద్రాద్రి సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఇంటి వద్దకే పంపిచనున్నట్లు ఆర్టీసీ డీఎం మోహన్‌రావు తెలిపారు. ఈమేరకు కల్యాణ తలంబ్రాల వాల్‌పోస్టర్లను హనుమకొండ బస్టాండ్‌లో గురువారం ఆవిష్కరించారు.

మార్కెట్ కార్యదర్శిని కలిసిన రైతులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో తక్కువ ధరకు మిర్చిని కొనుగోలు చేస్తున్నారని నిరసిస్తూ రైతులు గురువారం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. మిర్చి ధరలను నిర్ణయించేందుకు అధికారులు జెండా పాట నిర్వహించారు. తేజ రకం క్వింటాలుకు రూ.17,800 గరిష్ఠ ధరను నిర్ణయించారు. యార్డుల్లోని మిర్చిని వ్యాపారులు రూ.13 వేలకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఇదేమిటని ప్రశ్నించారు. వ్యాపారులు స్పందించకపోవడంతో మార్కెట్ కార్యదర్శిని కలిసి పరిస్థితి వివరించారు. దీంతో ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులను పిలిపించి మాట్లాడారు. నాణ్యత ప్రకారం ధరలు చెల్లించాలని సూచించడంతో రైతులు శాంతించారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన

ఖిలా వరంగల్: గతనెల 29నుంచి ఈనెల 1వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగిన 36వ సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ బాలికల జట్టు బంగారు పతకం సాధించింది. ఆ జట్టులో వరంగల్ జిల్లా జెడ్పీహెచ్ఎస్ మల్లంపల్లి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని జనగాం కావ్య కీలకపాత్ర పోషించి బంగారు పతకం అందుకుంది. ఈమేరకు వరంగల్ కలెక్టరేట్‌లో జనగాం కావ్యను కలెక్టర్ ప్రావీణ్య గురువారం అభినందించారు.

పంచలోహ విగ్రహాల బహూకరణ

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామిని ఆలయ కమిటీ అధ్యక్షుడు వోడ్నాల మల్లయ్య గురువారం దర్శించుకున్నారు. అనంతరం సీతారామ, లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలతో పాటు ఏసీని తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పంచలోహ ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా పుణ్యాహవచనం, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గర్భగుడిలో ఉంచగా భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. దాత వోడ్నాల మల్లయ్య, అతని కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

హసనపర్తి: వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడుతాయని ఇన్‌కం టాక్స్ కమిషనర్ (గుర్గావ్ ఫరిదాబాద్) శ్రీనివాస్‌కుమార్ అన్నారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 35వ స్పోర్ట్స్ డే వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని అలాగే కొనసాగించాలని సూచించారు. విద్యార్థి ఉన్నతస్థాయికి చేరడానికి క్రీడలు దోహదపడుతాయని వివరించారు. కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ క్రీడల వల్ల సృజనాత్మక శక్తులు పెంపొందుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కాశిబుగ్గ: పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపతాయని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయవీర్, కాశిబుగ్గ యూపీహెచ్‌సీ వైద్యుడు కిరణ్ అన్నారు. కాశిబుగ్గ స్టాండర్డ్ హైస్కూల్‌లో గురువారం పాఠశాల క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. తమ పిల్లలు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఆటలతో ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తా విజయ టాకీస్‌రోడ్డులోని పద్మాక్షి పాలీ క్లినిక్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగిన శిబిరంలో ప్రముఖ ఎండ్రోక్రైనాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్‌కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ అనిల్‌కుమార్ పాల్గొని సుమారు 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసి, సలహాలు, సూచనలు చేశారు. శిబిరంలో ఆస్పత్రి మేనేజ్‌మెంట్ రఘునాథ్‌రావు, మహేందర్, ధర్మరాజు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు అరుదైన అవకాశం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ పోటీల్లో దాదాపు 28 దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా శ్రీచైతన్య విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బండారి కిరణ్ కుమార్ తెలిపారు.

మాజీ కార్పొరేటర్‌కు కొండా మురళి పరామర్శ

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భర్త మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్‌ను మాజీ ఎమ్మెల్యే కొండా మురళీధర్‌రావు పరామర్శించారు. ఇటీవల భాస్కర్‌కు అపెండిసైటిస్ ఆపరేషన్ జరగింది. ఈ సందర్భంగా ఆయన నివాసానికి కొండా మురళి గురువారం వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైల్వే టీటీఈ మృతికి సంతాపం

కాశిబుగ్గ: కేరళలో టికెట్ అడగడంతో ఓ ప్రయాణికుడు రైల్‌లో నుంచి తోసేయడంతో వినోద్ అనే టీటీఈ మృతి చెందారు. ఈమేరకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో వినోద్ చిత్రపటానికి రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్ పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో సీటీఐలు విజయ్‌కుమార్, ఆర్ఆర్ ప్రసాద్, వీఆర్ అనిల్‌కుమార్, రమేష్‌బాబు, హరిబాబు, నాగరాజు, మధు, శంకర్, యాదగిరి, వంశీ, టీటీఈలు, టీసీలు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల పెగడపల్లిలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న బెల్ట్‌షాపుపై దాడి చేసి రూ.6,640 విలువైన మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బెల్ట్ షాపు నిర్వాహకుడు తాళ్లపల్లి రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్సై నిశార్ పాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.6,400 విలువైన మద్యాన్ని సీజ్ చేసి, బెల్ట్‌షాపు నిర్వాహకుడు వెంకటేశ్వర్లు అలియాస్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడులు చేసినట్లు వివరించారు.

ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ జన్మదిన వేడుకలు



వరంగల్: బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ జన్మదిన వేడుకలను బాలాజీనగర్ జంక్షన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకుడు ముడుసు నర్సింహ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు కొత్తకొండ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. హించిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పార్టీ వరంగల్ పార్లమెంటరీ కన్వీనర్ కుమారస్వామి, సౌత్ సెంట్రల్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్: రమేష్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్.. రమేష్‌ను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన ...

మడికొండ: అరూరి రమేష్‌ను ప్రశాంత్‌నగర్‌లోని తన నివాసంలో పలువురు నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దం మహేందర్, పానగోటి వెంకట్‌రావు, ఊకంటి వనంరెడ్డి, మల్లాడి తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ



కాజీపేట అర్బన్: హనుమకొండ నక్కలగుట్టలోని నారాయణ విద్యాసంస్థలకు చెందిన 113మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి 2023 –24 విద్యా సంవత్సరానికి నిర్వహించిన సీనాప్స్ ఒలింపియాడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల జీఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఆరు బహుమతులను అందుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. ఈమేరకు విద్యార్థులను పాఠశాలలో గురువారం అభినందించారు. కార్యక్రమంలో డీజీఎం రిజ్వాన, వేణు, ప్రిన్సిపాల్ రమేష్, కవిత పాల్గొన్నారు.